క్లుప్తంగా

స్వామిత్ర ద్వారా శాశ్వత హక్కుపత్రాలు



నకరికల్లు: నివేశన స్థలాలకు శాశ్వత హక్కు పత్రాలు కల్పించేందుకు ప్రభుత్వం స్వామిత్ర కార్యక్రమం రూపొందించిందని పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ అధికారి నాగేశ్వరనాయక్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలు, నివేశన స్థలాలకు శాశ్వత హక్కు పత్రాలు మంజూరు చేసే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించి, మాట్లాడుతూ సర్వే చేసే సిబ్బంది సమగ్ర వివరాలతో పూర్తి స్థాయి సర్వే చేపట్టి సకాలంలో నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై అవగాహన



అమరావతి: యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను చేజేతులా పాడు చేసుకుంటున్నారని ఎస్‌ఐ రాజశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ధరణికోట ఆర్‌వీవీఎస్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో గంజాయి, వైట్‌నర్‌లు, బోన్‌ఫిక్స్‌లు, డ్రగ్స్‌కు యువకులు బానిసలవుతున్నారన్నారు. ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక పోలీసు నిఘా పెట్టామన్నారు. ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించేవారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను తెలిపేలా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ధాన్యకటక ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యార్థులు, ఆర్‌వీవీఎస్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



క్రోసూరు: జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు గురువారం క్రోసూరులోని మండల పరిషత్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు సంస్థ జిల్లా చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తెలియజేశారు. ఈ శిబిరాన్ని మండల తహసీల్దార్ వి.వి.నాగరాజు , ఎస్‌ఐ పి.రవిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శిబిరానికి సహకారం అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇటువంటి సేవా కార్యక్రమాలను రెడ్ క్రాస్ సహకారంతో మరెన్నో చేస్తామని చెప్పారు. ఈ రక్తదాన శిబిరంలో 28 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, గ్రామ మండల నాయకులు, ప్రభుత్వ సిబ్బంది, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి ప్రదాతలకు నివాళులు



పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల వ్యవస్థాపక అభివృద్ధి ప్రదాతలు, భూదాతలు గుత్తికొండ తిరుపతి రెడ్డి, శ్యాల్లి చిన పిచ్చిరెడ్డి, వంకా జగన్నాథరావులను స్మరించుకుంటూ 'ఫౌండర్స్ డే'ను ఘనంగా నిర్వహించారు. భూదానం చేసి, పాఠశాలలో భవనాలను నిర్మించిన మహోన్నతమైన వ్యక్తులు అని, గ్రామంలో అనేక ప్రజాపయోగ పనులు చేసారని వారి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభదిన్ భోజనం ఏర్పాటు చేశారు. దాతలు ముగ్గురు ఆగస్టులోనే మరణించడం యాధృచ్ఛికమని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డి, పీసీ చైర్‌పర్సన్ బి.చంద్రకుమారి, మాజీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి, జె.రామిరెడ్డి, కె.పిచ్చి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండైనా.. వానైనా.. నిలబడాల్సిందే..!

మండలం కేంద్రం ఎటు వెళ్లడానికైనా ప్రధాన కూడలి బెల్లంకొండ క్రాస్ రోడ్డు



క్రాస్ రోడ్డులో ఎండలోనే నిల్చుని బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

బెల్లంకొండ: మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బెల్లంకొండ క్రాస్ రోడ్డు ప్రధాన కూడలి. నిత్యం ప్రయాణికులు, వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు మండలంలోని గ్రామాలకు రావాలంటే బెల్లంకొండ క్రాస్ రోడ్డు నుంచే రావాలి. మండల కేంద్రం నుంచి గుంటూరు, విజయవాడ వైపు వెళ్లాలన్నా... పిడుగురాళ్ల, మాచర్ల, హైదరాబాద్ వెళ్లాలన్నా బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దనే బస్సు ఎక్కాలి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన కొద్దిపాటి బస్సు షెల్టర్ ఆక్రమణలకు గురైంది. దీనితోపాటుగా బస్ షెల్టర్ ముందు వ్యాపార హోర్డింగ్లు, తోపుడు బండ్ల వ్యాపారులు ఆక్రమించుకున్నారు. దీంతో క్రాస్ రోడ్ వద్ద ప్రయాణికులు వేచి ఉండేందుకు నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా.. వానైనా ప్రయాణికులు రోడ్డు మీదే నిల్చుని బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు చొరవ తీసుకుని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లగడపాడులో ఘనంగా చేనేత దినోత్సవం



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న జంజనం కోటేశ్వరరావు

పెదకూరపాడు: మండలంలోని లగడపాడు గ్రామంలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం జరిగింది. చేనేత ఐక్య వేదిక సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం అధ్యక్షత వహించారు. పెదకూరపాడు అధ్యక్షుడు గోలి యల్లమందయ్య, పల్నాడు జిల్లా గౌరవ సలహాదారు వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు పాల్గొని చేనేత కార్మికుల హక్కులు రాయితీలు కోసం చేసే పోరాటంలో పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ రిజర్వుడ్ సీఐ అంకారావు నేతన్నలు ప్రభుత్వ సేవలు ఉపయోగించుకొని సాంకేతికంగా ముందుకు పోవాలని అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు టీ షర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు లగడపాడు శాఖాధికారి గంగాధర్ పాల్గొని ప్రసంగించారు. గ్రామ కమిటీ సభ్యులు, నేతన్నలు పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ జాగ్రత్తగా చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు



పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): పంట నమోదు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని, పంట రకం, పంట విస్తీర్ణం వివరాలు నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు చెప్పారు. మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో పంట నమోదు విధానాన్ని గురువారం పరిశీలించి నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండలంలోని ప్రతి సర్వే నెంబర్‌లో పంటను నమోదు చేయాల్సిందేనన్నారు. పంట రకాలు మార్చటం జరగదని నిజమైన సాగుదార్లను, వాస్తవమైన రకాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. పంటలు వేయని పొలాలను కూడా గుర్తించి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పంట రకాలు తప్పుగా నమోదు చేసినట్లయితే పంట కొనుగోలు సమయంలో ఇబ్బందులు వస్తాయన్నారు. గమనించి పంట నమోదు జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చేనేత మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ




చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: చేనేత కార్మిక కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రభుత్వం అందించడం జరుగుతుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 31వ వార్డు ఫణిదం ఫ్యాబ్రిక్స్‌లో జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారం ప్రభుత్వం భరించనుందని, త్రిఫ్ట ఫండ్ కింద ఏడాదికి రూ.5 కోట్లు విడుదల చేయడం జరుగుతుందన్నారు. ముందుగా చేనేత వస్త్రాలను పరిశీలించి ఆయన కొనుగోలు చేశారు. అలాగే రామకృష్ణాపురంలోని వినాయకుని గుడి వార్షిక మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఫణిదం చేనేత సొసైటీ అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీ గ్రేస్, నాయకులు మారెళ్ళ మల్లేశ్వరరావు, మునిబాబు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో సొసైటీల పాత్ర కీలకం

నకరికల్లు: గ్రామీణాభివృద్ధిలో కో ఆపరేటివ్ సొసైటీల పాత్ర కీలకమైందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కండ్లకుంట గ్రామంలో చీమలమర్రి సొసైటీ కార్యవర్గ ప్రమాణస్వీకారం గురువారం నిర్వహించారు. అధ్యక్షులుగా జంపని రామాంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా కంకణంపాటి వెంకట్రావు, షేక్ మహ్మద్‌హుస్సేన్ తదితరులు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో బకాయిలు ఉన్న రైతులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. నూతన కార్యవర్గం రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, రాష్ట్ర నాయకుడు కనుమూరు బాజిచౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య



మరణించిన మౌనిక

అమరావతి: వరకట్నం వేధింపుల కారణంగా మండల పరిధిలోని ఎనికపాడు గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగు చూసింది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం ఎనికపాడుకు చెందిన చిలక మౌనిక, చిలక నాగరాజు 2023లో తల్లిదండ్రుల అంగీకారం లేకుండా ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి సంవత్సరం వయస్సు గల చిలక దర్శిని అనే కుమార్తె ఉంది. ఈ నెల 5వ తేదీన మంగళవారం సాయంత్రం అత్త నాగమణి ప్రోత్సాహంతో భర్త నాగరాజు మౌనికను కొట్టడంతో మౌనిక ఇంట్లో ఉన్న పురుగమందు తాగటంతో వెంటనే గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అస్పత్రిలో చికిత్స పొందుతున్న మౌనిక(25) 6వ తేదీ మధ్యాహ్నం మరణించింది. ఈ క్రమంలో గురువారం పోలీసుల విచారణలో భర్త నాగరాజు, అత్త నాగమణి వరకట్నం కోరుతూ మానసికంగా, శారీరకంగా మౌనికను వేధింపులకు గురి చేస్తున్నట్లు వెల్లడయింది. మృతురాలు మౌనిక తండ్రి కొమ్మరబత్తిన కనక రత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో బాజీ మృతి చెందడం బాధాకరం



సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ సుభాని కుమారుడు షేక్ బాజీ (25) అనారోగ్యంతో అకాల మరణం చెందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్ రెడ్డి అన్నారు. మండలంలోని ఫణిదం గ్రామంలో బాజీ పార్థివ దేహాన్ని గురువారం ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



విజయపురి సౌత్: మాచర్ల మండల పరిధిలోని విజయపురి సౌత్‌లో గల 32, 33 రేషన్ షాపుల్లో తహసీల్దార్ కిరణ్ కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. రేషన్ డీలర్లంతా సమయపాలన పాటించాలని, సరుకులు సక్రమంగా సరఫరా చేయాలని తెలిపారు. అవకతవకలు పాల్పడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న స్టేట్ రిసోర్స్‌పర్సన్ రామచంద్రం

నకరికల్లు: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తే అన్నదాతలకు అధిక ఆదాయం వస్తుందని స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రం అన్నారు. నకరికల్లు రైతు సేవా కేంద్రంలో నకరికల్లు, కారంపూడి మండలాలకు చెందిన వీఏఏలకు మూడవ రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగులో తొమ్మిది సార్వత్రిక సూత్రాలను పాటించాలని అన్నారు. తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వివరిస్తూ భూమిని 365 రోజులు పచ్చని పంటలతో కప్పి ఉంచడం ద్వారా భూమిలో కర్బనశాతం పెరుగుతుందన్నారు. రక్షక, ఆకర్షణ, జీవ వైవిధ్య పంటలు వేయడం ద్వారా ప్రధాన పంటకు చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ విధానంలో భూమిలో సూక్ష్మజీవుల వృద్ధి జరుగుతుందన్నారు. రైతు తన సొంత విత్తనాన్ని తానే తయారు చేసుకోవడం వలన ఖర్చు తగ్గుతుందని, చీడపీడలను తట్టుకునే శక్తి పంటకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో దేవదాస్, జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ ప్రేమ్‌రాజ్, ప్రకృతి వ్యవసాయ జిల్లా సిబ్బంది ఎస్ఎఫ్ఏ అప్పలరాజు, నందకుమార్, వైపీ స్వాతి, ట్రైనర్ మాస్టర్ బాజీబాబు, సుబ్బారెడ్డి, హసీన, రామసుబ్బారెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



ప్రచార గోడప్రతులను ఆవిష్కరిస్తున్న మండల స్థాయి అధికారులు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన తహసీల్దార్ నాగరాజు



పెదకూరపాడులో ప్రచార గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ

రాజుపాలెం: ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల స్థాయి అధికారులు ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి రవిపాల్ మాట్లాడుతూ 2–19 ఏళ్లలోపు వయస్సు గల బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఈవోపీఆర్‌డీ ముక్కంటి, ఎంఈవో మల్లిఖార్జునశర్మ, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: ఈ నెల 12వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని 19 ఏళ్ల లోపు పిల్లల అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా చూడాలని తహసీల్దార్ వెంకట నాగరాజు గురువారం తెలియజేశారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన అన్ని శాఖల సమన్వయ కమిటీ సమావేశంలో తహసీల్దార్ పాల్గొని నులిపురుగుల నివారణ ఆవశ్యకతను తెలియజేశారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. మండలంలోని విద్యా, మహిళా శిశు అభివృద్ధి శాఖ, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, గ్రామ సచివాలయ శాఖ సమన్వయంతో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అంగనవాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తారని తెలియజేశారు. ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్ మాట్లాడుతూ ఆగస్టు 12వ తేదీన, మిగిలిపోయిన వారికి ఆగస్టు 20వ తేదీన మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...


పెదకూరపాడు : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల రెవెన్యూ టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 19 సంవత్సరాల లోపు పిల్లలు 8,521 మంది ఉన్నారన్నారు. వారికి ఈ నెల 12వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని కోరారు. 1–2 సంవత్సరాల పిల్లలకు 200 గ్రా. మాత్ర, 2–3 సంవత్సరాల పిల్లలకు 400 గ్రా. మాత్రను పొడిచేసి నీటి ద్వారా అందించాలని, 4–19 సంవత్సరాల పిల్లలకు మాత్రలు మింగించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనలక్ష్మి, ఎంపీడీవో సోమయాజులు, ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు దిలీప్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టపగలు ఓ ఇంటిలో చోరీకి యత్నం



సత్తెనపల్లి: పట్టపగలు ఓ ఇంట్లో చోరీకి యత్నించిన ఘటన పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గురువారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో దొప్పలపూడి పద్మజ గృహంలో గత 20 రోజులుగా ఎవ్వరూ ఉండకపోవడంతో ఇది గమనించిన గుర్తు తెలియని దుండగుడు గురువారం దొంగతనం చేసేందుకు తలుపు గడియ పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. ఇది బెంగళూరులో ఉన్న పద్మజ సీసీటీవీ ఫుటేజీ ద్వారా గమనించి 100కు ఫోన్ చేసింది. అప్పటికే దుండగుడు ఒక్కసారిగా లోపలకు ప్రవేశించగా సైరన్ మోగి పెద్ద శబ్దం రావడంతో షాక్‌కు గురై వెంటనే బయటకు పరుగులు తీశాడు. పట్టణ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు ఆ ఇంటిని పరిశీలించారు. పగలగొట్టిన తలుపు గడియను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. పట్టపగలు జరిగిన ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

బోనస్ పంపిణీ



పెదకూరపాడు (అచంపేట): అచ్చంపేట మండలంలోని పెద్దపాలెం సంగం డెయిరీలో పాలు పోసిన పాల ఉత్పత్తిదారులకు గురువారం సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు చేతుల మీదుగా రూ.4,63,000 బోనస్ అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వెంకటనారాయణ, కార్యదర్శులు నరసింహారావు, గోపి, రాములు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం



75 త్యాళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెదకూరపాడు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని 75 త్యాళ్లూరు సర్పంచ్ భూతం నరసయ్య అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలంటే తల్లులు బిడ్డలకు సంపూర్ణంగా పాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళలో తల్లిపాల వారోత్సవాలు

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని బీసీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, తల్లులు, కిశోర బాలికలకు తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలను అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, జమీలాబేగంలు వివరించారు. పుట్టిన బిడ్డకు అరగంటలోపు ముర్రుపాలు పట్టించడం వలన కలిగే లాభాలను వివరించారు. ముర్రుపాలు తాపించడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండా... పార్కింగ్ స్టాండా..!?



పెదకూరపాడు బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ప్రైవేటు వాహనాలు

పెదకూరపాడు బస్టాండ్ ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది. ఇష్టానుసారంగా ప్రైవేట్ వాహనాలు బస్టాండ్ ఆవరణలో నిలిపివేయడంతో ఆర్టీసీ బస్సులకు.. ప్రయాణికులకు తీవ్ర అవస్థలు ఏర్పడుతున్నాయి. ఆర్టీసీ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవటంతో ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. బస్టాండ్‌కు వచ్చిన ఒక క్రమ పద్ధతిలో కాకుండా వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు ప్రైవేటు వాహనాలను నియంత్రించాలని ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్లు కోరుతున్నారు. - పెదకూరపాడు

విద్య ద్వారానే ఆదివాసుల అభివృద్ధి



మాట్లాడుతున్న డీబీఆర్‌సీ కోటిరత్నం

రాజుపాలెం: ఆదివాసులు విద్యా, ఉపాధి ద్వారనే అభివృద్ధిని సాధించగలరని డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అన్నారు. మండల కేంద్రంలోని రాజుపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్టీలకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరత్నం మాట్లాడుతూ ఆదివాసులు అటవీ ప్రాంతంలో అడవిని నమ్ముకుని అడవిలో ఉన్న సంపదను తీసుకుని జీవనం కొనసాగిస్తారని, ఆదివాసులు, బంజారాలు ఆరాధ్య దైవంగా పూజించే శ్రీసంతాసేవాలాల్ మహరాజ్, ఏకలవ్య, చెంచు లక్ష్మీ జయంతి వేడుకలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో దుర్గాభాయి, వెలుగు సీసీ కోటమ్మ, మహిళా పోలీసు రమాదేవి, ఏపీవో వెంకటేశ్వర్లు, ఆదివాసులు పాల్గొన్నారు.